

CHANDRA
కంఠంనేని
రాధాకృష్ణ
మూర్తి
టోటల్
ఉమన్

మాధురి చనిపోయిందన్న వార్త నాకు మంచి ర్యాలలో ఉండగా తెలిసింది. మాధురి కమలాకర రావుకు మరదలు వరుస అవుతుంది. వాళ్ళది దూరపు చుట్టరికం. పెళ్ళాడాలని ఇద్దరూ ఎన్నో కలలు కన్నారు. పెద్దల నుండి అభ్యంతరాలు కూడా లేక పోయాయి. ఇంతలో ఈ ఘోరం జరిగింది.

మాధురితో నా కంతగా పరిచయం లేదు. ఒక్క సారి మటుకు చూశాను సరస్వతమ్మగారి ఇంట్లో. సన్నగా, ఎత్తుగా, చూడ ముచ్చటగా ఉండేది. చిలిపి తనంలో పూర్వపు మధుబాలను జ్ఞప్తికి తెచ్చేది. శాపవశాత్తు భూమి మీద అవతరించిన అప్సరస కన్య కాదుగదా అనిపించేది ఎవరికైనా ఆమెను చూసిన క్షణాన. కమలాకరరావు పనిచేసే పట్టణానికీ, మాధురి వాళ్ళ వూరికీ ఎంత లేదన్నా వందమైళ్ళ దూరం ఉంటుంది. వాళ్ళిద్దరి మధ్యా రోజు కో ఉత్తరమన్నా బట్వాడా అవుతుందని వినికిడి.

మిత్రుడు కమలాకరరావుకు జరిగిన అన్యాయానికి నే నెంతో విచారించాను. వెంటనే వెళ్ళి అతణ్ణి పరామర్శించి రావాలని అనుకున్నానుగాని మరో వారం రోజుల వరకు ఉద్యోగరీత్యా అక్కణ్ణించి కదలలేకపోయాను. మళ్ళీ కమలాకరరావును కలిసే సరికి మాధురి చనిపోయి అప్పటికి పదిహేను రోజులు దాటుతోంది.

"రా మిత్రమా రా" నన్ను చూడగానే కమలాకర రావు సాదరంగా ఆహ్వానించాడు.

అతని మొహంలో విషాదచ్ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కళ్ళు లోతుకు పీక్కుపోయి ఉన్నాయి.

"మంచి సమయానికి వచ్చావు" అత నన్నాడు. "ఈ సమయంలో నువ్వోస్తే ఎంత బాగుంటుందా అని అనుకుంటున్నాను కూడా ..."

కొద్దిసేపు వూరుకొని కమలాకరరావు మళ్ళీ అన్నాడు.

"మానవాతీత జీవులు ఉన్నాయంటే నువ్వు నమ్ముతావా? ఐ మీన్ సూపర్ నాచురల్ బీయింగ్స్."

అతని ప్రశ్న నాకు ఆశ్చర్యం కలిగించింది. అతను సైన్సు గ్రాడ్యుయేటు నాకు తెలిసినంతలో అతనికి మూఢ విశ్వాసాలు లేవు. అట్లాంటిది అత నా ప్రశ్న వేయటం వింతగా అనిపించింది నాకు.

"ఏమిటి, మాట్లాడవు?" తిరిగి ప్రశ్నించాడు కమలాకరరావు.

"నీకు తెలుసు నే నట్లాంటివి నమ్మనని!" అన్నాను.

"అవును, మొన్నటిదాకా నేనూ నమ్మేవాడిని కాదు. కాని ఇవాళ నమ్మక తప్పటం లేదు. ఈ మధ్య జరిగిన సంఘటనలు కారణంగా ..."

"ఏమిటవి?"

"నాకు ప్రియాతిప్రియమైన వ్యక్తులు చని పోయిన ప్రతి సారీ నాకో పిశాచ స్త్రీ తటస్థపడటం సంభవిస్తోంది. కాదు, కాదు, నా కా పిశాచస్త్రీ తటస్థపడుతున్న ప్రతి సారీ నాకు ప్రియమైన వ్యక్తుల్లో ఎవరో ఒకరు మరణిస్తున్నారంటే బాగుంటుంది."

"కాకతాళీయం కావచ్చు."

"అవును నేనూ అలాగే అనుకున్నాను. అసలు మొదటినుంచీ చెప్పుకొస్తాను ..." అంటూ మొదలెట్టాడు కమలాకరరావు.

మూడేళ్ళ క్రితం జరిగిందిది — దురదృష్ట వశాత్తూ అతని కా తేదీ కూడా బాగా గుర్తుంది. నవంబరు పదిహేనూ—పదహారు మధ్య జరిగింది. ఆ రాత్రి ఒంటి గంటకు కమలాకరరావు క్లబ్బునుండి తిరిగి వస్తున్నాడు. తిలక్ వీధిలో ఆ చివర ఉంది అతను ఉంటున్న గది. అంతకుముందు పేకాటలో అతను తన వద్ద నున్న డబ్బులన్నీ పోగొట్టుకున్నాడు. పరధ్యాన్నంగా తిలక్ వీధిలో ఆ మధ్యే కొత్తగా కట్టిన ఒక భవనం ముందు నుంచి నడిచి పోతున్న అతనికి హటాత్తుగా అనిపించింది, ఆ భవనం గుమ్మంలో ఎవరో నిలబడి ఉన్నట్లు. చప్పున తల పక్కకు తిప్పి చూశాడు. ఒక పొడుగాటి స్త్రీ, చెక్కతో చేయబడ్డ బొమ్మ మాదిరి కదల కుండా కట్టెలా నిలబడి ఉంది గుమ్మంలో. ఎదురుగా ఉన్న వీధి లైటు వెలుగులో ఆమెరూపం స్పష్టంగా కనిపిస్తోం దతనికి. ఆమె బాగా పొడుగ్గా ఉంది. ఆరడుగులకు తక్కువ ఉండదు. భుజాలు విశాలంగా ఉన్నాయి. గుడ్లగూబలా గుండ్రటి పెద్ద తీక్షణమైన కళ్ళు, గరుత్మంతుడిలా ఇంత పొడుగున ముందుకు పొడుచుకు వచ్చిన ముక్కు, పెద్ద గుహలాంటి నోరు — పల్చటి చవకబారు నైలాన్ చీర ధరించిం దామె. తలమీద తెల్లటి రుమాలు చుట్టుకుని గడ్డం క్రింద ముడి వేసుకుంది. అన్నింట్లోకీ ఆశ్చర్యమైంది ఆమె చేతి లోని విసనకర్ర! అంతటి చలిలోనూ మనంబొమ్మల్లో చూసే జపాను స్త్రీలలా ఆ విసన కర్రను రొమ్ముల కడ్డంగా సుతారంగా పట్టుకుని ఉందామె. ఆ అర్ధ రాత్రి ఆమె రూపం, ఆ దుస్తుల అలంకరణా, అదంతా — ఒక్క క్షణం కమలాకరరావుకు ఆమె ఆడవేషం వేసుకున్న మగవాడు కాదు గదా అనిపింప జేసింది. అలా అయితే బాగుండు ననిపించిందికూడా అతనికి లోలోపల. కాని ఆ రెండు కనుగుంటల్లోంచి తొంగిచూస్తున్న తీక్షణ దృక్కులు, తెరుచుకున్న బోసి నోటి లోంచి కనిపిస్తున్న వికృతమైన ఆ చిరు నవ్వు, అవన్నీ గమనిస్తుంటే అతని కనేక సందేహాలు కలిగాయి. ఎవరామె? మనిషేనా? లేక ... లేక ... చప్పున అతనికి అక్కణ్ణించి పారిపోవా లనిపించింది. కాని తనలోని పురుషాహంకారం వల్లా, ఆమె తన మనోభావాల్ని గ్రహించి తన వెక్కిరిస్తుందో నన్న భయం వల్లా అతడు తనను తాను నిగ్రహించుకున్నాడు. ఒక సారి వీధి పొడుగుతా ఆ చివరి నుంచి ఈ చివరకు పరికించి చూశాడు. విశాలమైన రోడ్డు అక్కడక్కడా వీధి దీపాలతో స్పష్టాస్పష్టంగా కన్పిస్తోంది. ఎక్కడా నరసంచారం లేదు. ఆ సమయాన గస్తీ తిరగాల్సిన గూర్ఖాకూడా అయిపు లేడు.

వీధికి ఆ చివర ఉంది అత నుంటున్న గది. భయాన్ని పక్కకు పెట్టి చిన్నగా నడవటం మొద లెట్టాడు. వీలైనంతలో అడుగుల వేగం హెచ్చు కుండా జాగ్రత్తపడుతూ, అలా ఆ భవనాన్నుంచి ఇరవై అడుగుల దూరం నడిచాడో లేదో సడన్‌గా అతనిలో ఒక దారుణమైన సందేహం ప్రవే శించింది. అది ఎంతటి దారుణమైనదో అంతటి సహజమైనది కూడా. ఆమె తనను అనుస రిస్తుందేమో...వెనుదిరిగి చూస్తే ??—ఆ భావం అతనిలో ప్రవేశించిందో, లేదో ఆ వెంటనే ఎక్కడ లేని భయమూ ఆవహించిం దతణ్ణి. ఆ భయంలోనే అతను అతి ప్రయత్నంమీద తల తిప్పి అటు చూశాడు. ఆ ! ఎట్లాంటి దృశ్యమది! ? ఆ ముసలిది అతని వెనకే, అతణ్ణి అనుకొన్నంత దూరంలో చప్పుడు కాకుండా నడుస్తోంది. దాని తల దాదాపు అతడి కుడిభుజంమీద ఒరిగినట్లు ఉండి, దాని చేతిలోని విసనకర్ర అతని భుజానికి గుల్తోంది....

ఆ సమయాన అతడి మనోస్థితిని వూహించు కోవాల్సిందే కాని వర్ణించ వలవికాదు. అనేకానేక భయ సందేహాలు కలిగా యతనిలో. ఎవరామె ? ఏం చేస్తోంది తన భుజంవద్ద? దొంగా?? నిజంగానే ఆడవేషం వేసుకున్న మగవాడా? లేక తన భయాన్ని కనిపెట్టి తన నేడిపించాలని వెంటపడ్డ కుటిలమతి అయిన ఎవరైనా ముసలిదా?? లేక ఏ మంత్రగత్తె నన్నానా??? వెంటనే కీచుమని కేకపెట్టి భయపడ్డ పిల్లవాడిలా ముందుకు పరిగెత్తాడతను. తన గది వద్దకు చేరుకునేవరకూ అతను ఆగనేలేదు. అక్కడికి చేరుకున్నాక మాత్రం అతనిలోని భయమంతా మంత్రం వేసినట్లు ఎటో ఎగిరి పోయింది. అప్పుడు చూశాడు వెనక్కు తిరిగి, వీధి ఈ చివరినుంచి ఆ చివరివరకూ ముసలిది ఎక్కడా కనిపించలేదు. ఇంతలోనే ఎటుపోయింది? ఏ ఇంట్లోకన్నా తప్పుకుందా??

ఆ సమయాన పక్క వీధిలోంచి వస్తున్న గూర్ఖా కనిపించా డతనికి. చప్పట్లు కొట్టి అతణ్ణి కేకేశాడు. ఫలానా భవనం గుమ్మంలో ఆడవేషం వేసుకున్న మగవా డెవడో ఉన్నాడనీ, దొంగయి ఉండొచ్చుననీ, వెళ్ళి చూసిరమ్మనీ పురమా యించాడు. ప్రతి గుమ్మాన్నీ జాగ్రత్తగా పరిశీలించుకుంటూ వెళ్ళమని కూడ అన్నాడు. కర్ర చప్పుడు చేసుకుంటూ గూర్ఖా చకచకా అటు వేపుకు నడిచాడు.

"ఎవరూ లేరుసార్, ఈపాటికి ఎటో తప్పుకుని వుండవచ్చు" అన్నా డతను కొద్దిసేపయ్యాక తిరిగి వచ్చి.

"అయి వుండవచ్చు" నీరసంగా అన్నాడు కమలాకరరావు తాళం తీస్తూ.

అగ్ని

అగ్ని అన్నిటిని
దహిస్తుంది
క్షుధాగ్ని సమాజాన్నే
దహిస్తుంది.

-ఎల్లోరా

"ఆ మర్నాడు నా కో ఉత్తరం వొచ్చింది, నాన్న మరణించినట్లు. ఆ క్రితంరాత్రి పోలీసు పిముకరిచిందట..."

చెప్పటం ఆపి కమలాకరరావు మౌనంగా కూర్చుండిపోయాడు.

నాకేం మాట్లాడాలో అర్థం కాలేదు.

కొద్దిసేపయ్యాక కమలాకరరావు మళ్ళీ మొదలెట్టాడు.

"ఇంతటితో ఈ కథ సమాప్తం చేంది వున్నయితే చాలామంది తెలివిగల వారిలా నేనూ ఆ ముసలిది నా వెనక వుండటానికి ఏదో ఒక కారణాన్ని చెప్పి వుందును. బహుశా ఆమె తల దాచుకోను ఇల్లు లేని ఏ పిచ్చి ముసలిదో అయి వుండవచ్చు. నేను కేచువుని పారిపోవటానికి ముందు నన్ను ఏ పదిపైసలో యాచించటానికి నా వెంట బడి వుండొచ్చు—

"అట్లా అని నమ్మటానికి చాన్నాళ్ళు ప్రయత్నించాను. కొద్ది నెలలకు అలా విశ్వసించటంలో కృతకృత్యుణ్ణి అయ్యాను కూడా. కాని...కాని... ఆ ముసల్ది మరోసారి నాకు మళ్ళీ కనిపించింది."

నాలో కుతూహలం పెరిగింది.

"ఎప్పుడు?"

"నా ప్రియురాలు మాధురి తొలిజా వార్త విన్న కొద్ది గంటలకు ముందు."

ఉలిక్కిపడ్డాను నేను.

"నిజం?" అప్రయత్నంగా కేక పెట్టాను.

"అవును. ఆరోజు ఉదయం అయిందవుతోంది. రంగరాజు తెలుసుకదూ నీకు, అతని పెళ్ళికి వెళ్ళి తిరిగి వస్తున్నాను. ఇంకా పూర్తిగా వెలుతురు రాలేదు కాని అప్పటికే, తెలతెలవారుతోంది అస్పష్టంగా. వీధి దీపాలు అప్పుడే తీసివేశారు. బీట్ కానిస్టేబుల్స్ ఇళ్ళకు వెళ్ళిపోయారు. మెయిన్ రోడ్డు చౌరాస్తా వద్దకు వచ్చాను నేను. సందులోకి మళ్ళబోతుండగా హటాత్తుగా నా ముందునుంచి నడిచిపోతున్న ఆ పొడుగాటి ముసల్ది కనిపించింది. ఆమె నావేపు చూడటం లేదు. నన్ను చూడలేదనే అనుకున్నాను...."

మూడేళ్ళ క్రితం ధరించిన అవే దుస్తులు. చేతిలో విసనకర్ర అదే తీరులో రొమ్ముల్ని కప్పుకుంటూ పట్టుకుని వుంది. ఆమెను చూడగానే ఒక్కక్షణం కమలాకరరావు గుండెలు కొట్టుకోవటం మానేశాయి. ఒక్క ఉదుటన ముందుకు గెంతాడతను. సందులు గొందులు దాటి పరుగెత్తుకుంటూ తనుంటువున్న వీధిలోకి వచ్చాడు. అప్పటి తని ఒళ్ళంతా చెమటలు కమ్మింది. ఆ ముసల్ది తనను గమనించటం లేదుకదా అనుకుంటూ ఆ వేళ కొంత సంతోషించసాగాడు. కాని ఇంటిదాకా వచ్చాక అతనికి హటాత్తుగా అనిపించింది—ఆమె తనను గమనించిందేమో, గమనించి మెయిన్ రోడ్డు మీద జనం వుంటారనీ, వెలుతురుంటుందనీ వూరుకుని కాస్త నిమ్మ చీకటిగా ఉన్న ఈ వీధిలోకి వచ్చాక తన పని పట్టవచ్చని వూరుకుందేమో. ప్రస్తుతం తన వెనుకే ఉందేమో.. అలా అనిపించేసరికి గభాల్న అతను వెనక్కు తిరిగి చూశాడు! ఆ వెంటనే అతని ఒంటిమీది రోమాలన్నీ నిక్కబొడుచుకున్నాయి. సరిగ్గా ఆ ముసలిది అతని వెనకే నిలబడి ఉంది. ఆమె చీర చెంగు అతని భుజానికి తగుల్తోంది. ఆమె మిడిగుడ్లు అతని కళ్ళల్లోకి చూస్తున్నాయి. నల్లటి పెద్ద గుహలాంటి ఆమె నోరు తెరుచుకుని అతణ్ణి వెక్కిరిస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఎలాంటి దృశ్యమని అది? ! !

ఆ క్షణాన అతనిలో భయం స్థానే క్రోధం చోటు చేసుకుంది. అది కోపమూ కాదు. పగ, కసి, ప్రతీకారం కోసం ఆరాటం. ఆ ఉద్వేగం అటవిక స్థాయిని చేరుకోవడంతో ఒక్క ఉదుటున ముసలి దానిమీద పడ్డాడు. దాని శరీరాన్ని గోడ కేసినొక్కి పట్టి రెండు చేతులతో దాని గొంతు పట్టుకున్నాడు. అలా చేస్తున్నప్పుడు అతని చేతులకు దాని రొమ్ములు, భుజాలు తగిలాయి. ఆ స్పర్శలో ఆమె ఆడదేనన్న సంగతి గ్రహించడానికి అతనికి పెద్ద కష్టం కాలేదు.

అతని చేతులు తన గొంతుకను తాకగానే ముసలిది ఒక్క అరుపు అరిచింది. ఆ కేక సదునుగా కమలాకరరావు గుండెల్లోకి చొచ్చుకు పోయింది. ఆమె కేకలకి అతని కెక్కడా భయమన్నది గోచరించ లేదు. చాలా సహజంగా, వికృతంగా ఉందది. మరుక్షణమే ఆమె తన గాజు కళ్ళతో సూటిగా అతని కళ్ళలోకి చూసింది.

"వదులు నన్ను. నాతో దెబ్బలాట పెట్టుకుంటా వెందుకు?" అన్నది కరకుగా.

"వదలను", గొంతు వదలకుండా అత నన్నాడు.

"ఎవరు నువ్వు? ఎందుకు నన్నువెంటాడుతున్నావు? నాతో నీ కేం పని?"

"నేనా బాబూ?" వెకిలిగా నవ్విందామె. "నేను అడుక్కు తినే ఒక ముసలిదాన్ని. ఎందుకో గాని నువ్వే నన్ను అనవసరంగా ద్వేషిస్తున్నావు. అకారణంగా నన్ను చూసి భయపడుతున్నావు. లేకపోతే మరేమిటి చెప్పు నాయనా, మొదటిసారి నన్ను చూసినప్పుడు ఎందుకు భయపడ్డావు నువ్వు?"

"మొదటిసారి ఎప్పుడు?" బింకంగా అన్నాడు కమలాకరరావు, ఆమెను గుర్తించనట్లు నటించుతూ.

"గుర్తు లేదా బిడ్డా?" వెక్కిరింతగా సమాధానమిచ్చింది ముసలిది. "మూడేళ్ళ క్రితం తిలక్ వీధిలో అర్ధ రాత్రి సమయాన."

దెబ్బకి అతని ఎముకల్లోని నజ్జుక్కూడా వణికింది. ఆమెకు తను గుర్తున్నా డన్నమాట!

"నన్ను నువ్వు ఎరుగుదువా? ఎట్లా ఎరుగుదువు? ఎప్పట్నుంచి ఎరుగుదువు?" ధైర్యాన్ని కోల్పోతూ నీరసంగా అడిగాడు.

"ఎరుగుదును నాయనా ఎరుగుదును. నువ్వు పుట్టక ముందునుంచీ నిన్నెరుగుదును. మొదటిసారి నువ్వు నా ముందు నుంచి నడిచిపోతుంటే అనిపించింది అతనే ఇతను అని."

కమలాకరరావు గుండెలు కంపించి పోయాయి.

"కాని కాని నువ్వెవరు? నే నెవరిని? నువ్వు నన్నెట్లా ఎరుగుదువు? మనిద్దరికీ ఏమిటి సంబంధం? నీకు నేనేమవుతాను, నాకు నువ్వేమవుతావు? అసలు నువ్వెవరివి?" పిచ్చి పట్టిన వాడిలా అడిగాడు.

"నేనా, నేను పిశాచాన్ని".

పెద్దగా అని, అతని చేతుల్లోంచి విడిపించుకోను పెనుగులాడుతూ కాండ్రించి అతని మొహం మీద వూసిందామె.

వెంటనే కమలాకరరావు పట్టు సడలిపోయింది. వూహించని చురుకుదనంతో ముసలిది అతని నుండి తప్పించుకుని మోకాళ్ళ వరకు చీరను పైకెత్తి పట్టుకుని పరుగు తీసింది. ఆమె పరుగెత్తుతుంటే పాదాలు నేల మీద ఆనుతున్నట్టే లేవు. కొంచెం చప్పుడన్నా కాలేదు.

అప్పుడామెను పట్టుకోవాలనుకోవటం పిచ్చితనమే అవుతుంది. అప్పటికే పూర్తిగా తెల్లవారి పోయింది. ఒకరొకరుగా వీధిలో జనం కదులాడుతున్నారు. వీధి ఆ చివరి వరకు పోయాక ముసల్ది ఆగి వెనక్కు


ఎలాంటి
అజీర్ణమైనా
మంత్రించినట్లే
నయమవుతుంది



హ్యూలెట్స్ మిక్చర్



మీకు బేబి/బాబు కావాలా



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులయి ఇచ్చిన యోగ్యతాపత్రములు కలవు. స్త్రీ పురుష వంధ్యాదోషనివారణ నిపుణులు. ఉచిత వివరములకు

శ్రీ నాగార్జున మూలిక కుటీరం
రైల్వే స్టేషన్ వద్ద, రామాలయం వీధి.
తెనాలి - 2

తిరిగి అతని వేపు మళ్ళీ చూసింది. బెదిరిస్తున్నట్లుగా చేతిలో విసనక్రరని ఒకటి రెండు సార్లు ఆడించి గబుక్కున పక్క సందులోంచి మాయమైంది.

“నేను గదిలోకి ప్రవేశించిన కొద్ది సేపటికి ఒక మనిషి మాధురి మరణవార్తను మోసుకు వచ్చాడు”. కమలాకరరావు అన్నాడు. “చెప్పు మిత్రమా ఇప్పుడు చెప్పు! ఆ ముసల్ది ఎవరంటావు? మానవ జీవియేనా? ఆమెను చూసి ఇన్‌స్టింక్టివ్‌గా నే నెందుకు భయపడాలి? నా ఆత్మీయుల్లో ఎవరో ఒకర్ని పోగొట్టుకున్న సమయాల్లోనే అది నా కెందుకు తటస్థ పడుతోంది? ఈ సంఘటనలు ఒక దాని కొకటి సంబంధ ముందంటావా లేక ఉత్త కాకతాళీయమేనా? అసలది ఎవరు? నా పాలిటి పిశాచమా? మృత్యువా? ఎవరది? ఏమిటది?”

కమలాకరరావుకు నేనే సమాధానమూ ఇవ్వలేక పోయాను. తరవాత చాన్నాళ్ళ వరకు నేనా ముసలి దాని గురించే ఆలోచించాను. వాళ్ళిద్దరి మధ్యా జరిగిన సంభాషణ. నిజంగానే తను చెప్పుకున్నట్లు. ఆమె ఏ అడుక్కు తినే ముసలిదో కావచ్చు. మతి చలించిందీ అయి ఉండొచ్చు! ఆ రెండు సార్లూ అతనికి కాకతాళీయంగా తటస్థ పడి ఉంటుంది. చిన్నప్పట్నించీ కమలాకరరావు తనలో పెంచుకున్న మనోబలహీనాల వల్ల ఆమెను చూచినప్పుడు భుజాలు తడుము కున్నట్లు చేసి ఉంటాడు. అతనిలో స్పష్టంగా కనిపించిన పిరికితనాన్నే, బలహీనాన్నే గమనించి ఆ ముసల్ది అతణ్ణి ఏడిపించ ప్రయత్నించి ఉండ వచ్చు. అయితే నా ఈ రీజనింగ్స్‌ని బలహీనపరిచే సంఘటన ఒకటి జరిగింది.

కమలాకరరావుతో పై సంభాషణ జరిగాక మళ్ళీ నే నతణ్ణి కలవనే లేదు. అయిదు నెలల తరవాత మాత్రం నాకో ఉత్తరంవచ్చింది. కమలాకరరావు హాస్పిటల్‌లో ఉన్నట్లూ, కామెర్ల రోగంతో బాధపడు తున్నాడనీ, నన్ను కలుసుకో గోరుతున్నాడనీనూ. ఉత్తరం అందిన రెండు రోజులకు నే నక్కడకు చేరుకున్నాను. కాని అప్పటికే సమయం మించి పోయింది. అతగాడి శవాన్ని బయటికి తీసుకు వస్తున్నారు. బంధువులూ వాళ్ళు చాలా మంది ఉన్నారు. వాళ్ళతోపాటు విషాదంగా నేనుకూడా స్మశానానికి నడిచాను.

స్మశానాన్ని ప్రవేశిస్తుండగా అకస్మాత్తుగా నా దృష్టి ఒక స్త్రీ మీద పడింది. ఆమె చాలా పొడుగుంది వయస్సు వార్ధక్యాన్ని స్పృశిస్తోంది.

కమలాకరరావు శవాన్ని చూసి ఆమె వెకిలిగా నవ్వింది. తరవాత తన చేతిలో ఉన్న విసనక్రరతో శవవాహకులకు దారి చూపించుతూ చితి వద్దకు నడిచింది.

నా మిత్రుడి అజన్మశత్రువు ఆమే నన్న సంగతి గ్రహించడానికి నా కట్టే సేపు పట్టలేదు. నా కెంతో ఆశ్చర్యం, ఆందోళన కలిగాయి. ఆమెసరిగ్గా కమలాకరరావు వర్ణించినట్లే ఉంది—పొడుగాటిముక్కు, గుడ్లగూబ కళ్ళు, పెద్ద బోసినోరు, నెత్తిమీద, రుమాలు, ఆఖరుగా ఆవిసనక్రర. అవును.సందేహం లేదు. ఆమె నా మిత్రుడు చెప్పిన ముసలిదే.

నేను తన వేపే చూస్తుండటం చూసి ఆమె తీక్షణంగా చూసింది నా వేపు. ఆ చూపులో నానా రకాలైన భావా లున్నాయి నన్ను గుర్తించినట్లు, తను గుర్తించిన సంగతి నాకు తెలియ జేయాలన్నట్లు, తిలక్ వీధిలో జరిగిన సంఘటనలు నా మిత్రుడు నాకు చెప్పిన విషయం తనకు తెలుసునన్నట్లు, తన వెలగాటంలో నా మిత్రుడి తరవాత వారసుణ్ణి నేనే నన్నట్లూ. విచిత్రమైన ధోరణిలో చూసింది.

నిజం చెప్పాలంటే జరుగుతున్న కాకతాళీయ సంఘటనలకు ఆశ్చర్యం నా విషయమై ఆందోళన ఎక్కువ పని చేసింది నాలో. నా మిత్రుడికీ, ముసలి దానికీ మధ్య మానవాతీతమైన పూర్వ జన్మలకు సంబంధిచిన వైరమేదో ఉండి ఉండాలనిపించింది. అదే సమయాన నాకు తట్టాలఅనిపించింది నా మిత్రుడుగురైన శాపానికి నేనువారసుణ్ణి కాబోవటం లేదు కదా? నా వళ్ళు జలదరించింది.

నన్ను చూసి ముసలిది నవ్వసాగింది. నాభావాల్ని చదివినట్లూ, పది మంది లోనూ నా పిరికితనాన్ని బయటపెట్ట దలుచుకున్నట్లూ. చేతిలోని విసన క్రరతో నా వేపు చూపించు తుంది. తూలి పడి పోకుండా పక్కనున్న మనిషి భుజం పట్టుకున్నాను.

నన్ను చూసి జాలి పడ్డట్లు నిర్లక్ష్యంగానో ఎడమచేతిని అలవోకగా గాలిలోకి విసిరి ముసలిది వెనుదిరిగి స్మశానం మధ్యలోకి నడిచింది. అక్కడకు పోయాక వెనక్కు తిరిగి విసనక్రరతో ఒకసారి విసురుకుని, నా వేపు చూసి తల పంకించింది. ఆ వెంటనే గాలిలో ఊగుతున్నట్లుగా నడుచుకుంటూ పోయి అవలీలగా ఉన్న సమాధుల మధ్య అదృశ్య మయింది.

★




Swastika/SC/1163 TL.